క్లుప్తంగా

విద్యార్థులకు డ్రాయింగ్ సామగ్రి పంపిణీ

మున్నంగి(కొల్లిపర): ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు వినియోగించుకుని విద్యార్థులు నూటికి నూరు శాతం మార్కులు సాధించాలని ఎంఈవో- 1 సాల్మన్‌రాజు చెప్పారు. మున్నంగిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఆర్)లో గురువారం విద్యార్థులకు చిత్రలేఖనం పుస్తకాలు, కలర్ పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను వెలికి తీయడానికి నిత్యం కృషి చేయాలని సూచించారు. వర్క్ బుక్‌లు ఎప్పటికప్పుడు పూర్తి చేయించాలని, అక్షరాలను పలకపై దిద్దించాలని తెలిపారు. పాఠశాలకు వస్తున్న ప్రతి విద్యార్థికి తప్పకుండా జగనన్న విద్యాకానుక అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాము పాల్గొన్నారు.

పేద పిల్లలకు నోట్ పుస్తకాలు



తెనాలి టౌన్: పట్టణ 13వ వార్డు ఎస్టీ కాలనీలోని చర్చి దగ్గర ఆర్ఎస్ ఫౌండేషన్ ఇండియా వ్యవస్థాపకులు పాస్టర్ పల్లె శామ్యూల్ ఆధ్వర్యంలో 50మంది పేద పిల్లలకు గురువారం నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, జామెంట్రీ బాక్స్‌లు అందజేశారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ పేద పిల్లలకు వారి ఆర్థిక ఇబ్బందులు చదువుకు అడ్డుకాకూడదని భావించి పుస్తకాలు అందించినట్లు తెలిపారు. విద్యార్థుల సంక్షేమానికి సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రోహి ఝాన్సీరాణి, సుష్మ రేచల్, సంఘసభ్యులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో అర్ధ చాతుర్మాస మహోత్సవం



తెనాలి టౌన్: శ్రీశైలం మహాక్షేత్రంలో శ్రీ సాలీగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలస్వామిజీ పర్యవేక్షణలో అర్ధ చాతుర్మాస మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం చంద్రమౌళేశ్వరస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు, అమ్మవారికి విశిష్ట పూజలు జరిపారు. భక్తులకు చాతుర్మాత విశిష్టత గురించి బాలస్వామీజీ అనుగ్రహ భాషణం చేసి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మఠం జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య దంపతులు, కోశాధికారి గోపు రామకృష్ణ దంపతులు, ఏలూరి రాజేశ్వరరావు దంపతులు, చుండూరు శ్రీరామ్‌బాబు పాల్గొన్నారు.

వైద్యశాలను సందర్శించిన ఏపీ సాక్స్ బృందం

తెనాలి అర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలను ఏపీ సాక్స్ సీడీసీ, వీహెచ్ఎస్ బృందం గురువారం పరిశీలించింది. హెచ్ఐవీ కార్యక్రమాల్ని మెరుగు పరిచే విషయాలపై వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణితో చర్చించారు. ఓపీడీలో హెచ్ఐవీ పరీక్షలు చేయడానికి ఉన్న అంశాలపై మాట్లాడారు. బృందం సభ్యుల్లో డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ తరుణ్, డాక్టర్ విజయరామన్, పి.వెంకట్, రాష్ట్ర ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ చంద్రశేఖరన్, జ్యోతుల వీరాస్వామి ఉన్నారు.

విద్యార్థి దశ నుంచే ఎన్నికల విధానంపై అవగాహన



తాడేపల్లి రూరల్: విద్యార్థి దశలోనే నాయకులను ఎన్నుకోవడం ద్వారా ఎన్నికలపై అవగాహన ఉంటుందని ఆరో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి.వి. హనుమంతరావు అన్నారు. గురువారం నగర పాలక సంస్థ పరిధిలోని అత్మకూరు గ్రామంలోని నిర్మల ఇంగ్లిష్ మీడియం హైస్కూలులో ఇన్వెస్టర్స్ సెర్మ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 6వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి.వి.హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించిన విధంగానే ఈ పాఠశాలలో కూడా విద్యార్థి నాయకులను ఎన్నుకోవడం సరైన విధానమని అన్నారు. ఎవరు సమర్థుడైన నాయకుడో అంచనా వేసుకునే స్థాయికి విద్యార్థులు ఎదుగుతారని తెలిపారు. అనంతరం ఎన్నికైన విద్యార్థి నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించారు. పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జాన్‌పాల్ మాట్లాడుతూ విద్యార్థులు తమ నాయకులను పార్లమెంటరీ విధానంలో ఎన్నుకోవడం వల్ల విద్యార్థి దశ నుంచి వారికి తమ నాయకుడిని ఎన్నుకునే విధానం అలవాటు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల పిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ జ్ఞాన సుందరి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అసమానతలు తొలగించేందుకే పథకాలు

- ప్రజల జీవన ప్రమాణాలను పెంచడం అభివృద్ధి కాదా?
- మళ్లీ అధికారంలోకి రాలేమన్న కడుపుమంటతో ప్రతిపక్షాలు
- జగనన్న సురక్ష శిబిరంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, ప్రజాప్రతినిధులు

తెనాలి: రాష్ట్రంలో ఆర్థిక అసమానతలను తొలగించి, పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాల్ని పెంచడానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యతను ఇస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఫలితంగానే ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగిందనీ, రాష్ట్రంలో జీడీపీ పెరుగుదల ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. పట్టణ 39, 40 వార్డుల పరిధిలో జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరం గురువారం పట్టణ అయితానగర్‌లోని కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చాక దేశంలో సంక్షేమ పథకాలతో పేదలకు రూ.2.10 లక్షల కోట్లను ఎలాంటి అవినీతి లేకుండా నేరుగా అర్హులకు అందజేసింది కేవలం మన రాష్ట్రంలో జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని గుర్తు చేశారు. తెనాలి నియోజకవర్గంలో రూ.1500 కోట్లను ప్రజల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. ప్రజల విజ్ఞప్తులతో 11 రకాల ధ్రువీకరణ పత్రాల్ని అందించేందుకు జగనన్న సురక్షను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమాజంలో ఉంటే, ప్రతిపక్ష టీడీపీ కేవలం సామాజిక మాధ్యమాల్లోనే ఉంటోందని విమర్శించారు. జనసేన నేత నాదెండ్ల మనోహర్‌ను ఉద్దేశించి, ఈమధ్య తెనాలి వచ్చిన ఒక నాయకుడు, సచివాలయ వ్యవస్థ ఉండగా మళ్లీ జగనన్న సురక్ష ఎందుకు అని ప్రశ్నిస్తున్నారని గుర్తు చేశారు. ప్రజలకు రోజుల వ్యవధిలో అవసరమైన సర్టిఫికెట్లను అందించేందుకు జగనన్న సురక్ష చేపట్టామని తెలిపారు.

టీడీపీ, జనసేన కార్యకర్తలకు కూడా సంక్షేమం ఇస్తున్నామని చెప్పారు. వారి ఇళ్లకు వెళ్లినపుడు తమ పరిపాలన బాగుందని లబ్ధిదారులు స్పష్టంగా చెబుతున్నారని కూడా అన్నారు. గతంలో ఎవరూ ఇలా చేయలేదన్నారు. ప్రజలకు సంతృప్త స్థాయిలో సంక్షేమాన్ని అందిస్తూనే రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధినీ చేపడుతోందని చెప్పారు.

చంద్రబాబు కాకుండా ఇంకెవరూ సీఎంగా ఉండకూడదా?

ప్రజల్ని పరిపాలించే అర్హత కేవలం చంద్రబాబుకు మాత్రమే ఉందన్న రీతిలో బస్సుయాత్రలో టీడీపీ నాయకులు చెబుతున్నారని, చంద్రబాబు కాకుండా ఇంకెవరూ సీఎంగా ఉండకూడదా? ఇంత బాగా పరిపాలిస్తున్న సీఎంను తిడతారా? అంటూ ప్రశ్నించారు. నిజానికి ఆ బస్సు యాత్రలు బైబై యాత్రలేననీ, తెనాలిలోనూ ఆయనకు ఇక బైబై చెబుతారని ఎద్దేవా చేశారు. ప్రతినెలా ఒకటో తేదీనే నియోజకవర్గంలోని 36 వేలమందికి రూ.12 కోట్లకు పైగా పింఛన్లు ఇస్తున్నామని, వాటితో అవ్వాతాతలు సంతోషంగా ఉంటున్నారని ఎమ్మెల్యే శివకుమార్ చెప్పారు. మరోవైపు విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ర్యాంకుల్ని సాధించారని గుర్తుచేశారు. ఇక అధికారంలోకి రాలేమన్న బాధ, దుగ్ధతో ప్రతిపక్షాలు జగన్‌ను, ఎమ్మెల్యేలను దూషిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, కౌన్సిలరు గెద్దేటి ఝాన్సీవాణి మాట్లాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్లు మట్లపూడి సంధ్యారాణి, పేరం సంజీవరెడ్డి, రాష్ట్ర జలవనరుల కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, కృష్ణబలిజ, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావటి నిర్మల, పార్టీ నేతలు తాడిబోయిన రమేష్, దేసు శ్రీనివాసరావు, వేజండ్ల శ్రీకాంత్, అత్తోట అమృతరాజు, ఈపూరి నికో ప్రసాద్, టెక్స్‌బాల, అక్కిదాసు కిరణ్ పాల్గొన్నారు.

గుడివాడలో అభివృద్ధి పనులు ప్రారంభం



శ్మశానవాటిక అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తెనాలి టౌన్: గ్రామాల్లో అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. రూరల్ మండలం గుడివాడలో రూ.45లక్షలతో పూర్తి చేసిన అభివృద్ధి పనుల్ని ఎమ్మెల్యే శివకుమార్, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, సర్పంచ్ యడ్లపాటి రాకేష్ గురువారం ప్రారంభించారు. గ్రామంలో రూ.20లక్షలతో హిందూ శ్మశాన వాటిక అభివృద్ధితో పాటు ప్రహరి, నాడు-నేడు కింద రూ.18లక్షలతో పాఠశాలలో వివిధ అభివృద్ధి పనులు, రూ.9లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తునట్లు చెప్పారు. అభివృద్ధిలో భాగంగా గ్రామాల్లో ప్రణాళిక ప్రకారం రోడ్లు, సైడ్ కాల్వల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.విజయాలక్ష్మణ్, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, పీఆర్ ఏఈ ఎం.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్వో హైమావతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఝాన్సీ, వైఎస్సార్ సీపీ నాయకులు కడియాల శివరామబ్రహ్మం, పూర్ణయ్య, బొందులూరి పద్మావతి, నాగేశ్వరరావు, మత్తే ధన కిశోర్, పిల్లి రాజు, బురదగుంట రమేష్, మత్తయ్య, మోషే, అబ్రహాం, వలంటీర్లు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్



తెనాలి: ఇంటికి వచ్చి మరీ దరఖాస్తు చేయించి అవసరమైన ధ్రువీకరణ పత్రాల్ని రోజుల వ్యవధిలో ఉచితంగా ఇవ్వడం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక సీబీఎస్ కాలనీ, రామలింగేశ్వరపేట ఓపెన్ ఆడిటోరియంలో జరిగిన శిబిరాల్లో చైర్‌పర్సన్ ముఖ్యఅతిథిగా పాల్గొని సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. గతంలో ఏదైనా పని కావాల్సినా, ధ్రువీకరణ పత్రం అవసరమైనా, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేదని ఆమె గుర్తుచేశారు. అర్హత ఉండీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోతున్న ప్రజల ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ఇంటి ముంగిటకే వచ్చి మరీ సర్టిఫికెట్లను అందజేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ అనూష, కౌన్సిలరు కఠారి రత్నకుమారి, నాయకులు బూరెల దుర్గాప్రసాద్, కఠారి హరీష్, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికి జగ్జీవన్‌రామ్ సేవలు మరవలేనివి



జైభీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేవయ్య



తెనాలి రైల్వేస్టేషన్ రోడ్డులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న న్యూటన్



కొలకలూరులో నివాళులర్పిస్తున్న ఏఎన్‌యూ స్టడీ చైర్ పరిశోధకుడు రవికిరణ్



అన్నదానం చేస్తున్న మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్ మాదిగ



రైల్వేస్టేషను రోడ్డులో జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న శంకరరావు

తెనాలి అర్బన్: జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు మరవరానివని ఏపీపీ సుద్దపల్లి సుకుమార్, గుర్రం జాషువా విజ్ఞాన సమితి అధ్యక్షుడు న్యూటన్ పేర్కొన్నారు. గుర్రం జాషువా విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి మరువరానిదని కొనియాడారు. ఆయన సేవల్ని ప్రస్తుత ప్రజాప్రతినిధులు విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎ.జాస్మిన్, టి.రవికుమార్, కె.రమేష్, వి.రత్నం, ఇందుపల్లి రాజారాం, కె.ఆశోక్, పినపాటి సురేష్, గుంటూరు కృష్ణ, బి.ధనుంజయరావు, బడుగు రత్నకుమార్, కె.సురేష్‌కుమార్, వి.రవి, పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ప్రకటించాలి

తెనాలి టౌన్: దేశానికి ఉప ప్రధానిగా, వివిధ శాఖలకు మంత్రిగా సేవలు అందించిన బాబు జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ప్రకటించాలని ఏఎన్‌యూ జగ్జీవన్‌రామ్ స్టడీ చైర్ పరిశోధక విద్యార్థి యడ్లపల్లి రవికిరణ్ కోరారు. రూరల్ మండలం కొలకలూరులో జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పరిశోధక విద్యార్థి రవికిరణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని జగ్జీవన్‌రామ్ సేవలకు గుర్తింపుగా భారతరత్న ప్రకటించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దేశంలో దళిత, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి, సేవలు మరువలేనివని కొనియాడారు. జగ్జీవన్‌రామ్ ఆశయాలకు అనుగుణంగా నేటి యువత పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ కమిటీ చైర్మన్ పినపాటి అనిల్‌కుమార్, కొలకలూరి నాగేశ్వరరావు, శీలం వినయ్‌కుమార్, ఉన్నం ప్రేమయ్య, సొపాటి శ్రీను, జోసఫ్, చార్లి, ఆరంబాక జయరామ్, ఉన్నం అఖిలేష్, సుదర్శపల్లి అంబేడ్కర్ పాల్గొన్నారు.

- గంగానమ్మపేటలోని జైభీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో జైభీమ్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు కొవెవరపు దేవయ్య, ఎంపీటీసీ సభ్యురాలు పేరం అరుణ, వైఎస్సార్ సీపీ నాయకులు కాకిదేవ సహాయం, వేముల మహేష్, బేతాళ భూషణం పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ సెంటర్‌లో పేదలకు అన్నదానం

తెనాలి టౌన్: జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆయన విగ్రహానికి మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నెగంటి రమేష్ మాదిగ, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దండోరా నాయకులు కొవెవరపు కోటేశ్వరరావు, సుద్దపల్లి వినోద్, కంచర్లపాలెం వీజేఆర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపనకు బాబూజీ కృషి

తెనాలి: భారత దేశ ఉపప్రధానిగా చేసిన డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రామ్ చివరి వరకు సమసమాజ స్థాపనకు కృషిచేశారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. బాబూజీ వర్ధంతి రోజైన గురువారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రైల్వేస్టేషను రోడ్డులోని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. జగజ్జీవన్‌రామ్ సేవల్ని స్మరించుకున్నారు. సంఘం తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కుర్రా శ్రీను, పోలిశెట్టి వెంకటేశ్వరరావు, సోమానాయక్ పాల్గొన్నారు.

తెనాలి ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషి

సిబ్బందికి జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.రవికాంత్ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న రవికాంత్

తెనాలి అర్బన్: తెనాలి ఆర్టీసీ డిపో అభివృద్ధికి ఉద్యోగులంతా కృషి చేయాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.రవికాంత్ సూచించారు. తెనాలి డిపోను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పరిధిలో ఐదు డిపోలున్నాయని చెప్పారు. ప్రజారవాణా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొట్టమొదటిసారిగా తెనాలి వచ్చినట్లు తెలిపారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా పలు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బస్సు సర్వీసుల్ని పెంచడంతో పాటు ప్రయాణికుల నుంచి వచ్చిన వినతుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. రెండు నెలలకు ఒకసారి డయల్ యువర్ ఆర్ఎం, నెలకు ఒకసారి డయల్ యువర్ డీఎం కార్యక్రమాల్ని క్రమంతప్పకుండా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అరుణాచలం గిరి ప్రదర్శన సర్వీసులకు ఆదరణ ఉందని, దాన్ని కొనసాగించనున్నట్లు చెప్పారు. 40మంది ప్రయాణికులు ఉంటే వారి దగ్గరకే బస్సుల్ని పంపేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గుంటూరు-తెనాలి నాన్‌స్టాప్‌ల స్థానంలో సింగిల్ స్టాప్ అల్ట్రా పల్లె వెలుగు బస్సుల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. అనుమతులు రాగానే సర్వీసులు ప్రారంభిస్తామన్నారు. తెనాలిలో బస్సు బయలుదేరితే నారాకోడూరులో స్టాప్ ఉంటుందని, అక్కడి నుంచి నేరుగా గుంటూరు వెళ్తుందని చెప్పారు. ఉద్యోగులంతా సమన్వయంతో పనిచేస్తూ ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని ఆయన సూచించారు. సమావేశంలో డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, సీఐ ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం



దంతలూరులో రోగుల్ని పరీక్షిస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ

దంతలూరు(కొల్లిపర): గ్రామీణ ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి దగ్గరే మెరుగైన వైద్యసేవలు, మందులు అందిస్తున్నామని మండల వైద్యాధికారిణి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ తెలిపారు. మండలంలోని దంతలూరులో గురువారం ఫ్యామిలీ డాక్టర్ సేవల్ని అందించారు. 104 వైద్య శిబిరంలో వైద్యాధికారి 100 మంది రోగులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. గ్రామంలో 10 మంది దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. మందులు అందజేసి సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు, వర్షాల కారణంగా వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గోరు వెచ్చని నీరును తాగాలని సూచించారు. కార్యక్రమంలో 104 సిబ్బంది బొమ్ము కోటిరెడ్డి, సూపర్‌వైజర్ సాయిబాబు, ఏఎన్ఎం స్వరూపరాణి, హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వ్యాక్సిన్‌తోనే రేబిస్ వ్యాధికి అడ్డుకట్ట



పెంపుడు కుక్కకు వ్యాక్సిన్ ఇస్తున్న డాక్టర్ నాగిరెడ్డి

తెనాలి: రేబిస్ వ్యాధి ప్రమాదకరమని, చికిత్స కష్టమని పశుసంవర్ధకశాఖ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వై.కేదారేశ్వర్ అన్నారు. వ్యాధిసోకకుండా పెంపుడు కుక్కలకు ముందుగానే వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం రోజైన గురువారం పట్టణ బుర్రిపాలెంరోడ్డులోని పశువైద్యశాలలో ఉచిత రేబిస్ వ్యాధి నిరోధక వ్యాక్సినేషను శిబిరాన్ని నిర్వహించారు. పట్టణ, పరిసరాలకు చెందిన పలువురు యజమానులు తీసుకొచ్చిన పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషను చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కేదారేశ్వర్ మాట్లాడుతూ పశువుల నుంచి మనుషులకు సంక్రమించే ప్రమాదకర వ్యాధుల్లో రేబిస్ ఒకటని గుర్తుచేశారు. ఈ వ్యాధి రాకుండా నివారించుకోవడమే మార్గమన్నారు. కుక్కలకు లేదా మనుష్యులకు సంక్రమించాక బతికే అవకాశం దాదాపు ఉండదని చెప్పారు. ప్రభుత్వ పశువైద్యశాలల్లో రేబిస్ వ్యాధి వ్యాక్సిన్‌ను పెంపుడు జంతువులకు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగిరెడ్డి, వీఏఎస్ డాక్టర్ మీనాక్షి, డాక్టర్ కీర్తి, రవితేజ, ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉచిత దుక్కులు ప్రారంభం



దుక్కి దున్నటాన్ని పూజలతో ప్రారంభించిన అంజయ్య

పెదరావూరు(తెనాలి): రూరల్ మండలం పెదరావూరులో పాలడుగు రంగయ్య, అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న సేవలో భాగంగా గ్రామానికి చెందిన సన్న, చిన్నకారు రైతులకు ఉచితంగా ట్రాక్టరుతో దుక్కిదున్నే కార్యక్రమాన్ని చేపట్టారు. ట్రస్ట్ చైర్మన్ పాలడుగు అంజయ్య ట్రాక్టరుకు పూజలు చేశారు. గ్రామస్తులు, పెద్దలతో కలసి దుక్కిదున్నటాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ రైతులకు చేస్తున్న సాయాన్ని పలువురు కొనియాడారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ మారొతు సీతారామయ్య, అనంత లక్ష్మీనారాయణ, కర్రి హరనాథరెడ్డి, పాలడుగు సురేంద్ర, పాలడుగు సుధీర్, పాలడుగు కోటయ్య, పాలడుగు బుజ్జి, సాల్మన్, రైతులు పాల్గొన్నారు.

రేపు మాదిగ విద్యార్థులకు ప్రోత్సాహకాల ప్రదానం

నెహ్రూనగర్: ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్, ఎంపవర్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో రాష్ట్ర, జిల్లాస్థాయిలో ప్రతిభ కనపరిచిన మాదిగ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు అసోసియేషన్ గౌరవ సలహాదారు సీహెచ్. బాలస్వామి తెలియపారు. 13 ఉమ్మడి జిల్లాల్లో టాపర్లుగా నిలిచిన వారికి ఈ నెల 8న సాయంత్రం 4 గంటలకు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన మాదిగ విద్యార్థులకు రూ.50వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.30వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.20వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

వర్షాలకు వరి వెద పెట్టిన చేలు మునక



కంచర్లపాలెంలో నీట మునిగిన చేలో రైతులు

తెనాలి: భారీ వర్షాల కారణంగా వరి వెద పెట్టిన చేలు నీటి ముంపునకు గురయ్యాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి తెలిపారు. మండలంలోని కంచర్లపాలెం, సోమసుందరపాలెం, అయితానగర్, కొల్లిపర మండలంలోని అత్తోటలో పంట పొలాల్ని ఆయన రైతులతో కలసి గురువారం పరిశీలించారు. పంట, మురుగు కాల్వలకు మరమ్మతులు చేయని కారణంగానే ఈ దుస్థితి దాపురించిందని, విత్తనం మొలకెత్తే పరిస్థితి లేదని తెలిపారు. దీనివల్ల రైతులు ఎకరాకు రూ.5-7 వేలు నష్టపోయే పరిస్థితి నెలకొందని చెప్పారు. ప్రభుత్వం తగిన నష్టపరిహారం ఇచ్చి, విత్తనాలను ఉచితంగా పంపిణీ చేయాలని ఆయన కోరారు.

గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఇంచార్జి ఎంపీడీవో చంద్రమోహన్

కొల్లిపర: గ్రామీణ హౌసింగ్, జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ శాఖ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇంచార్జి ఎంపీడీవో చంద్రమోహన్ తెలిపారు. ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం అందజేస్తున్న రుణాలు, కాలనీల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఎక్కువ మంది నిర్మించుకునే విధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో గృహ నిర్మాణాలు వందకు వంద శాతం పూర్తి కావాలని ఆయన చెప్పారు. గ్రామాల్లో ఇప్పటిదాకా జరిగిన నిర్మాణాలు, ఇంకా ఎంత మంది నిర్మించాలనే అంశాల్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బి.సుబ్బారావు, ఈవోపీఆర్డీ శంకరరావు పాల్గొన్నారు.